ప్రేమించి పెళ్ళిచేసుకున్న అతను భార్యను ఏం చేశాడు?

# వి. ప్రతిమ కథ

# మగాడి మరో కోణం

'సాయం సంధ్యా నీరెండలో అద్భుతంగా మెరిసిపోతోంది.

ఆఫీసులోని గోడ గడియారం అయిదుసార్లు పిచ్చుకగొంతు ననుకరించింది.

ఉదయం నుండీ పనిచేసి అలసివున్నా యిక యింటికి వెళ్ళే ఉత్సాహంలో హడావిడిగా ఫైల్స్ సర్దేస్తోన్న సంధ్య ఉలిక్కిపడింది భాస్కరాన్ని చూసి.

"అరె ఏవిటిలా వచ్చారు?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"మీతో కొంచెం పనుంది" నవ్వాడతడు.

విస్మయంగా చూసింది సంధ్య.

ఇదివరకు భాస్కరం, సంధ్యా ఒకే సెక్షన్లో ప్రక్క ప్రక్క సీట్లలో వుండేవారు.. సెక్షను మారిపోయాక అతడినెన్నడూ చూడలేదు సంధ్య... ఒక్కసారి తన పెళ్ళి ఇన్విటేషన్ను యివ్వటానికి కాబోలు వచ్చాడు... అంతే మళ్ళీ యిప్పుడు ఉరుముల్లేని పిడుగులా... ఏవిటో నాతో పని.

మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోన్నా పైకి మాత్రం.

"చెప్పండి ఏమిటి విషయం" ప్రశాంతంగానే ప్రశ్నించింది.

"మరేం లేదండీ రేపు నా శ్రీమతి పుట్టిన్రోజు... ఆఫీసయ్యాక మీరు నాతో వచ్చి శ్రమనుకోకుండా ఓ చీర సెలెక్ట్ చేసి పెట్టాలి ప్లీజ్" సంకోచిస్తూ పలికాడు.

"ఓస్ యింతేనా" అని మనసులో అనుకుంది.

"ఓహ్... తప్పకుండా భలేవారే ఇదేమంత పనని? మగాడు తన భార్య పుట్టిన్రోజుని



యింత బాగా గుర్తుంచుకుని బహుమతి నివ్వాలనుకోవడమే గొప్ప విషయం... ఐ డూ అప్రిషియేట్ యూ... వెల్ పదండి నాకూ పనైపోయింది'' సర్దిన ఫైల్స్‌ని టేబిల్ మీద ఓ ప్రక్కగా వుంచుతూ లేచి నిల్చుంది సంధ్య.

''థాంక్స్' అంటూ ఆఫీసు వెలుపలికి నడిచాడు భాస్కరం.

సంధ్యారాణి ''విమెన్స్ వరల్డ్'' మహిళా మండలి ప్రెసిడెంటు. స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ''విమెన్స్ వరల్డ్'' ముఖ్యోద్దేశం. ఊళ్ళో ఏ మూలన స్త్రీకి అన్యాయం

జరిగినా బాధిత స్త్రీ తరఫున నిలబడి న్యాయం కోసం పోరాడుతుంది ''ఉమెన్స్ వరల్డ్''

ఏదో రెండు రోజులు వీధుల్లో బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేసి అంతటితో చల్లారి పోయే రకం మహిళా మండలి కాదిది... న్యాయంకోసం చివరివరకూ నిలిచిపోరాడగల ధైర్యమున్నది. సంధ్యారాణి ఆధ్వర్యంలో మిగిలిన మెంబర్సంతా కలిసి పని చేస్తుంటారు.

సంధ్యారాణిని ఆఫీసులో కూడా అంతా గొప్పగా గౌరవిస్తారు.

అందుకే వున్న కాస్త పరిచయాన్ని పురస్కరించుకొని ఆమెని చీర సెలెక్ట్ చేయమని కోరాడు భాస్కరం.

''ఇదెలా వుంది'' తెల్లటి తెలుపు జార్జెటు చీర మీద పెద్దవీ, చిన్నవీ గులాబీలు పరుచుకున్న ఆ చీరని చూపించి ప్రశ్నించిందామె.

''బాగానేవుంది. మీరు సెలెక్ట్ చేయండి. నాకు తెలీదు.''

ఆ చీర ప్యాక్ చేయించి బిల్ పే చేశాక.

''థాంక్స్యూ ఒన్స్ఎగైన్... మిమ్మల్ని దింపేసి వెళ్ళనా?'' మర్యాద పూర్వకంగా ప్రశ్నించాడు.

''అబ్బె అక్కర్లేదండీ... ఇక్కడికి దగ్గర్లోనే మా క్లబ్ మెంబరొకావిడవుంది. ఆవిడతో కొంచెంసేపు మాట్లాడి నేను బస్‌లో వెళ్ళిపోతాను.''

''ఐసీ... ఒ.కె. బై'' అంటూ వెళ్ళిపోయాడతడు.

భార్యమీద అతడికున్న ప్రేమనీ, పరాయి స్త్రీకి అతడిస్తోన్న గౌరవాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయింది సంధ్య.

* * *

''ఏమిటోయ్ భాస్కరం అంత డల్‌గా వున్నావీరోజు'' ప్రతీ అయిదు నిముషాలకీ ఓసారి సిగరెట్టు వెలిగిస్తూ, పనిమీద ధ్యాస చూపించని భాస్కరాన్ని విస్తుపోయి చూస్తూ ప్రశ్నించాడు ప్రక్కసీటు దామోదరం.

''అబ్బే ఏం లేదు'' కాలుస్తోన్న సిగరెట్టు పీకని యాష్ట్రేలో పడేస్తూ తడబడ్తూ సమాధానం చెప్పాడు.

''ఏమీ లేక పోవడమేమిటి?'' ... చెప్పవోయ్. తప్పకుండా ఏదోవుంది'' తొందరగా వదిలిపెట్టేరకం కాదు దామోదరం.. గుచ్చిగుచ్చి ప్రశ్నించాడు.

''మరేం లేదండీ, నా భార్య పుట్టింటికి వెళ్ళి వారం రోజులైపోయింది. మర్నాడే వచ్చేస్తానని చెప్పి వెళ్ళింది. ఇంకా ఎందుకు రాలేదా అక్కడ ఏం జరిగి వుండొచ్చు అని ఆలోచిస్తున్నానంతే... వీలైతే సాయంత్రం వెళ్ళి వద్దామనుకుంటున్నాను... అంతకుమించి మరేమీ లేదు'' నవ్వడానికి ప్రయత్నించాడతడు.

''అబ్బో అబ్బో యిదంతా పెళ్ళాం మీద బెంగన్నమాట. ఏం పిచ్చివాడివోయ్. మాకైతే పెళ్ళాం పుట్టింటికి వెళితే పండగన్న మాట పేకాడుకోవచ్చు, ఎప్పుడైనా ఓ పెగ్గు మందుకొట్టొచ్చు... యింకా వీలైతే అమ్మాయిల్తో తిరగొచ్చు. యింటి దగ్గర

మనకోసం ఎదురుచూసే వాళ్ళూ, ఆలస్య మైతే చీవాట్లు పెట్టే వాళ్ళూ యెవరూ వుండరు... అలా అనుకుంటే యెంతో ఫ్రీగా ఆకాశంలో పక్షిలా ఎగిరిపోతున్నట్లుం టుంది''

''అబ్బే లేదండీ నా భార్యను మోసం చేయడం నా కిష్టం లేదు'' బుద్ధిమంతుడిలా చెప్పాడు భాస్కరం.

''పెళ్ళయిన కొంతకాలం వరకూ అలానే వుంటుందిలే'' అంటూ ముసిముసిగా నవ్వుకున్నాడు దామోదరం.

* * *

వర్షం వలన నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది.

వర్షం పూర్తిగా తగ్గిపోయినా దాని తాలూకూ ఛాయలు మాత్రం యింకా పూర్తిగా వీడిపోలేదు... అంతకు క్రితం రోజు నమోదైన ఓ కేసు తాలూకూ ఫైల్ని పూర్తి వివరాలకోసం మళ్ళీ స్టడీ చేస్తున్నాడు ఎస్.ఐ రఘురావ్.

''ఎస్.ఐ గారూ ప్లీజ్ హెల్ప్‌మీ''

పరిగెత్తుకుంటూ లోపలికొచ్చాడు భాస్కరం ...


''అరే ఎవరు మీరు? ఏమైంది?'' చూస్తున్న ఫైల్ని మూసేస్తూ లేచి నిల్చుని ఆదుర్దాగా ప్రశ్నించాడు రఘురావ్.

హెడ్ కానిస్టేబుల్ హనుమంతూ, మిగిలిన కానిస్టేబుల్స్ కూడా కంగారుగా ఎస్.ఐ గదిలోనికి వచ్చారు.

''మరేం లేదు సర్ (స్కూటర్ స్లిప్ అయి నా భార్య కింద పడింది. ఆమెకు స్పృహ తప్పింది. దగ్గర్లో ఎక్కడా ఆటోలున్న జాడ కన్పించలేదు. ఆమెను హాస్పిటల్‌కి చేర్చాలి ప్లీజ్... ప్లీజ్ హెల్ప్‌మీ సర్'' దాదాపుగా ఏడ్చేస్తున్నాడు భాస్కరం.

''అప్పుడు గమనించాడు రఘురావ్ అతడి బట్టలకున్న బురద మరకల్ని.

''బాగానే వుంది. రక్షణకోసమే కాకుం



డా ఆటోలకోసం కూడా పోలీస్‌స్టేషన్‌కే రావాలా ఏంటి?'' సన్నగా గొణుక్కున్నాడు హనుమంతు.

''పదండి చూద్దాం'' అంటూ అతడి వెనుక నడిచాడు మానవతావాది రఘురాం.

ఆమెను చూశాక యిక ఒక్క క్షణం ఆలస్యం చేయలేదు అతడు.

వెంటనే జీప్‌లో హాస్పిటల్‌కి చేర్చాడు. డాక్టరుగారు చూసి ఆమెకేమీ ప్రమాదం లేదని చెప్పాక యిక స్టేషనుకి బయల్దేరాడు రఘురావ్... అతడి రెండు చేతులూ పట్టుకుని కళ్ళకద్దుకుని.

''మీరు చేసిన సాయం ఈ జన్మలో మర్చిపోలేనిది... నా ప్రాణం... నా యింటి దేవత... నా సర్వస్వమూ అయిన భార్యని సమయానికి హాస్పిటల్‌కి తీసుకువచ్చి కాపాడారు'' కృతజ్ఞతలు తెలిపాడు భాస్కరం.

''నో... నో ఇట్స్ మై డ్యూటీ'' అతడికేసి చూస్తూ చెప్పి జీపెక్కాడు రఘురాం.

* * *

ఆరోజు దీపావళి.

ప్రతిరోజూ చీకటి రాజ్యమేలుతూండే వీధులన్నీ కూడా ఆరోజు నిండు దీపాల వెలుగుతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. డాబాల గోడల అంచులమీదనుంచి దీపాలు గర్వంగా తలలెగరేస్తున్నాయి.

భాస్కరం ఉత్సాహంగా వాకిట్లో దీపాలు వెలిగిస్తున్నాడు. శారద పది నెలల కొడుక్కి స్నానం చేయించి డ్రస్ చేస్తోంది.

ప్రమిదల్లో నూనె పోసి ఆరిపోతున్న దీపాలని మళ్ళీ మళ్ళీ వెలిగిస్తున్నాడు భాస్కరం... అతడి వాలకం చూస్తూంటే చాలా రోజులుగా అతడీ దినం కోసమే ఎదురు చూస్తున్నట్లుగా వుంది.

ఇదంతా చూస్తూ అతడి తల్లి ముఖం చిట పట లాడిస్తూ సన్నగా గొణుక్కుంటూంది. ''శారదా త్వరగారా టపాకాయలు కాల్చుకుందాం'' అంటూ బాబుని తీసుకుని వరండాలోనికి వచ్చాడతడు. ఆమె వింతగా అతడివైపు చూసి చకచకా పని ముగించుకుని చీరమార్చుకుని తనూ వాకిట్లోనికి వచ్చింది.

ఉత్సాహంగా బాబుతోనూ, ఆమెతోనూ కాకర పువ్వొత్తులూ,. చిచ్చుబుడ్లూ, విష్ణు చక్రాలూ అన్నీ కాల్పించాడు. అంతా పూర్తయ్యాక హఠాత్తుగా జరిగిందది... శారద చీరకి ఎలా నిప్పంటుకుందో తెలీదు కానీ ఒక్కసారిగా మంటలు ఆకాశానికి లేచాయి.

బాబు తల్లిని చూస్తూ గుక్క పట్టి ఏడుస్తూన్నాడు. బాబు ఏడుపుతో ముఖం చిట పట లాడించుకుంటూ వెలుపలికి వచ్చిన అత్తగారు కొడుకు వంక ఆత్రుతగా చూసింది.

అంతా చూస్తుండగానే శారద దేహం బూడిదగా మారింది. ఆమె చేసిన హృదయవిదాకరమైన దీనాలాపాలు దీపావళి చప్పుళ్ళలో చుట్టుప్రక్కల ఎవరికీ విన్పించేనట్టుగా లేదు.

* * *

శారద చనిపోయి వారం దాటింది.

భాస్కరం ఇంకా ఆఫీసుకి వెళ్ళడం లేదు.

విషయం ఆలస్యంగా తెలుసుకున్న సంధ్యారాణి పరామర్శించడానికి భాస్కరం యింటికి వెళ్ళింది.

"సారీ భాస్కరం... ఏం చేద్దాం చెప్పండి. మీకు మీ భార్యంటే ఎంతిష్టమో, ఆమెను మీరెంతగా ప్రేమిస్తారో నాకు బాగా తెలుసు. అలాంటి అదృష్టవంతురాలు ఈ విధంగా అర్ధాంతరంగా మిమ్మల్ని విడిచివెళ్ళడం నిజంగా మీకు తీరనిలోటు, నేను కాదనను... కానీ తప్పదు. బాబుకోసమైనా మిమ్మల్ని మీరు కంట్రోల్ చేసుకోక తప్పదు.

హృదయ విదారకంగా ఏడుస్తోన్న భాస్కరాన్ని యింతకంటే యెలా ఓదార్చాలో అర్థం కాలేదు ఆమెకి. చాలా సేపటి వరకూ భాస్కరం వద్దనే వుండిపోయింది.

ఆ మర్నాటి ఉదయం సంధ్య ఆఫీసుకి బయల్దేరుతుండగా బెల్ మ్రోగింది.

తలుపు తీసిన సంధ్య పరిచయం లేని ఆగంతకుణ్ణి చూసి ఆశ్చర్యపోయింది. "ఎవరు కావాలండీ" అంటూ ఒకడుగు వెనక్కి వేసిందామె.

ఈ మధ్యన తరచుగా పేపర్లలో చూస్తోన్న దొంగతనాలు వరసగా ఆమె కళ్ళముందు నిలిచాయి ఒక్కక్షణం. అయితే ఆమె వూహించినట్లుగా అతడు లోపలికి దూరి సంధ్యారాణిని కత్తి చూపించి బెదిరించనూ లేదు, నగలిమ్మని వేధించనూ లేదు.

'క్షమించండి... మీరు సంధ్యారాణి కదూ'

"అవును"

"నా పేరు సుందరం... మీ ఆఫీసులో పనిచేస్తూన్న భాస్కరం యింటి ప్రక్కనే వుంటున్నాను... " సంకోచిస్తూ తనను తాను పరిచయం చేసుకున్నాడతడు. మళ్ళీ తనే

"నేను మీతో ... మాట్లాడాలి" చెప్పాడు.

విస్తుపోయింది సంధ్య.



## ట్రైనింగ్

కన్నారావ్‌ని అడిగాడు సోంబాబు—

"ఏంట్రా? ఈ మధ్యలో కొట్లాటల్లో, రేపుల్లో ఎక్కువగా పాల్గొంటున్నావట?"

"అబ్బే ఏం లేదురా? పోలీస్ ట్రైనింగ్‌కి ప్రిపేర్ అవుతున్నానంతే!"

—యం.డి. ఇబ్రహీమ్ (తాళ్ళవలస)

భాస్కరం ప్రక్క ఇంట్లో వుంటున్నత డికి తనతో మాట్లాడాల్సిన అవసరమేంటి?.. కొంపదీసి పెళ్ళి చేసుకోమని అడగడు కదా... అదే అయితే మాత్రం నిరాశ తప్పదు... సంధ్య యిలా ఆలోచించడానికి కారణం వుంది... ఆమె అనేకమార్లు ఇటువంటి సమస్యను ఎదుర్కొని వుంది కనుక... ఒంటరిగా వున్న ఆడదాన్ని మగాడి కి పెళ్లి చేసుకోమంటూ అడగడం చాలా తేలిక... ఇలా ఆలోచిస్తూనే నవ్వుకుంటూ

''రండి కూర్చోండి'' అంటూ కుర్చీ చూపించింది.

తాను కూడా అతడి ఎదురుగా వున్న కుర్చీలో ఆసీనురాలౌతూ 'కాఫీ పట్టుకుర మ్మని' పనిపిల్లని కేకేసి చెప్పింది.

''చెప్పండి. ఏదో మాట్లాడాలన్నారు'' మౌనంగా వున్న అతడిని చూస్తూ కుతూహ లంగా ప్రశ్నించింది సంధ్య.

''శారద అంటే భాస్కరం భార్య దీపావళి ప్రమాదంలో చనిపోలేదు'' హఠాత్తు గా చెప్పాడతడు.

''చనిపోలేదా?'' నిటారుగా అయింది సంధ్య.

ఇది ఆమె ఎదురుచూడని విషయం... నిర్ఘాంతపోయి అతడినే చూడసాగిందామె.

''నిజం సంధ్యారాణిగారూ... శారద చనిపోలేదు... చంపబడింది. ఈ మధ్యన ప్రాణాలు విదుస్తోన్న చాలమంది కోడళ్ళలాగే శారద కిరోసిన్ పోసి చంపబడింది.

''ఎవరు? ఎవరు చేశారీపని''

''భాస్కరం''

''నేన్నమ్మను'' అప్రయత్నంగా అంది.

''అవును ఎవరూ నమ్మడంలేదు''

''నిజమే అతడికి భార్యంటే ఎంత అభిమానమో నాకు బాగా తెలుసు. స్త్రీని అతడు చాల గౌరవిస్తాడు''

సంధ్యకి బాగా కోపమొచ్చింది.

కోడళ్ళ ఆత్మహత్యా ప్రయత్నాలతోనూ, హత్యా నేరాలతోనూ నిండివున్న ఈ నూతన సమాజం ఓ కోడలు అకాల మృత్యువు దాపురించి సహజ మరణాన్ని పొందినా నమ్మడానికి ఇష్టపడటంలేదు'' అనుకుంటూ విసుగ్గా—

''ఇకమీరు వెళ్ళొచ్చు'' అన్నట్లుగా అత డివైపు చూసింది.

అతడు ఇబ్బందిగా కుర్చీలో కదులుతు న్నాడు.

''రుజువేమిటి?'' ఉండబట్టలేక మళ్లీ ప్రశించింది సంధ్య.

''రుజువులూ, సాక్ష్యాలూ, నిరూపణ లూ నేను తీసుకురాలేను. శారద మాత్రం చంపబడింది. ఆమె సహజంగా మరణించలే దు''

''పోనీ మీరెలా చెప్పగల్గుతున్నారు? మీరు చూశారా?''

''లేదు. చూడలేదు'' అంటూ క్షణం ఆగి

''శారదని పుట్టింటికెళ్లి డబ్బు తీసుకుర మ్మని భాస్కరం, ఆమె తల్లీ తరచుగా వేధిస్తూండే వాళ్ళు... ఒకటిరెండుసార్లు శారద మా ఆవిడ వద్దకి వచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంది కూడ. శారదవంటి గంభీర స్త్రీమూర్తులు యెంతో భరించరాని బాధైతే నే తప్ప ఇలా పరాయివాళ్ల ముందు

బయటపడదరు.''

''శారద పుట్టింటివాళ్లు బాగా డబ్బున్న వాళ్లు కావడంతో భాస్కరం ఆమెని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు ఆస్థికోసం... తమకి ఇష్టం లేకుండా పెళ్లాడిందని ఆమె తల్లిదండ్రులు శారదకి డబ్బివ్వడానికి ఎంతమాత్రమూ ఒప్పుకోలేదు.

అప్పట్నుంచీ మొదలైంది శారదమీద ద్వేషం.

''పుట్టింటికి వెళ్లి డబ్బు తీసుకురమ్మనమనీ, లేదంటే వదిలేస్తాననీ శారదని అప్పుడప్పుడూ బెదిరించేవాడు. అభిమానవతియైన శారద పుట్టింటికి ససేమిరా వెళ్లనని మొండికేసింది... అలా అయితే విడాకుల పత్రం మీద సంతకం చేయమని వేధిస్తున్నాడనీ, తనకి చనిపోవడం తప్ప మరో మార్గం లేదనీ చివరిసారిగా కలిసినప్పుడు శారద మా ఆవిడతో చెప్పింది.

''ఆత్మహత్య ఈ సమస్యకి సరైన పరిష్కారం కాదనీ, బాబుకోసం అలాటి పని చేయవద్దనీ'' మందలించి పంపిందట మా ఆవిడ.

కానీ మనమంతా ఆనందంగా ఎదురు చూసే దీపావళి పండుగరోజు ఆమె మరణానికి భాస్కరం ముహూర్తం పెట్టాడని కొంచెం కూడ ముందుగా వూహించలేకపోయాం''

''కానీ అతడికి భార్యంటే యెంతో ప్రేమ'' ఇంకా నమ్మలేకపోతోంది. సంధ్య భాస్కరం తన భార్యను హత్య చేశాడంటే.

అవును అదే అతడు చేసిన తెలివైన పని.

''నలుగురి ఎదుటా భార్యంటే తనకి దేవతన్నట్లుగా ప్రవర్తించేవాడు. తనను సృష్టించిన దేవుడే తెలుసుకోలేని విధంగా భార్య మీద ప్రేమ ఒలకబోసేవాడు. స్వయంగా నా భార్య శారదకి స్నేహితురాలు కానట్లయితే ఆరేళ్ల మా బాబు ఆ సంఘటన చూసి వుండకపోయినట్లయితే నేను ... నమ్మేవాణ్ణి కానేమో భాస్కరం ... పని చేశాడంటే''




# రాణులరాజు

*1605 నుంచి 1627వ సంవత్సరం వరకు రాజ్యమేలిన మొఘల్‌రాజు జహంగీర్‌కు 300 మంది మహారాణులు ఉండేవారట! అంతేకాదు ఆయన సరదాల కోసం మరో ఐదుమేల మంది అందాల భామలు, వెయ్యిమంది యువకులు కూడా ఆయన అంతఃపురంలో ఉండేవారట! రాజభవనం బయట పన్నెండువేల ఏనుగులు, పదివేల ఎద్దులు, రెండువేల ఒంటెలు, మూడువేల జింకలు, నాలుగువేల కుక్కలు, వంద సింహాలు, అయిదు వందల గేదెలు, పదివేల పోస్ట్‌పావురాలు ఉండేవట! మరి రాజుగారంటే మాటలా!*

—జూపిటర్

''మీ బాబు చూశాడా'' కుతూహలం గా ముందుకు వంగింది సంధ్య.

''అవును ఆరేళ్ళ బాబు అబద్ధాలు చెప్పగలడనికానీ, అలాటి సంఘటనని ఊహిఎంచి సృష్టించగలడనిగానీ నేననుకోవడంలేదు'' గంభీరంగా పలికాడతడు.

''మరయితే అప్పుడే ఎందుకు చెప్పలేదు మీరు'' క్రాస్ ఎగ్జామిన్ చేసింది సంధ్య.

''నాకీ విషయం తెలిసింది నిన్ననే గనుక''

''అసలేం జరిగిందో వివరంగా చెప్పండి ప్లీజ్'' ఇప్పుడు సుందరం చెప్తోన్న విషయాలు నమ్మదగినవిగా కన్పిస్తున్నాయి సంధ్యారాణికి.

వివరంగా చెప్పసాగాడతడు.

''ఆరోజు దీపావళి... నేను అయిదింటికే వస్తానని చెప్పడంతో మా బాబు నా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు... నా భార్య మాత్రం తన తరపు బంధువులెవరో వస్తే వాళ్లని ఆదరించడంలో తలమున్కలైవుంది... నాకు వేరే పని తగిలి చెప్పిన సమయానికి వెళ్ళలేకపోయాను.

తండ్రి వస్తానని రాకపోవడం... తల్లి అతిథుల గొడవలో పడి తనను పట్టించుకోక పోవడంతో నిరాశగా బాబు డాబా మీదికెళ్లి నిల్చుని వీధి చివరకంటూ చూస్తున్నాడు... ఇంతలో ప్రక్కింటిలోని దీపాలూ, టపాకాయల హడావిడి వాడిని ఆకర్షించింది. ఆశగా వారివైపే చూస్తున్నాడు. దాదాపుగా టపాకాయలన్నీ కాల్చడం పూర్తయ్యాక అప్పుడు జరిగిందది.

భాస్కరం అంకుల్ కిరోసిన్ డబ్బా తెచ్చి భార్యమీద పోసి నిప్పంటించడం... శారద ఆంటీ పెద్ద పెద్దగా కేకలు పెడ్తున్నయెవరూ పట్టించుకోకపోవడం చూస్తుండగానే ఆమె కాలి బూడిదై పోవడం... ఇదంతా వాడు కళ్ళారా చూసాడు.

నా భార్య తొమ్మిదయ్యాక అతిథుల్ని సాగనంపి, అప్పుడు బాబు కోసం వెతుక్కుని పైకెళితే .అప్పటికే వీడు స్పృహతప్పి పడివున్నాడు. ప్రక్కింట్లో నుండి భాస్కరం తల్లి—

''అయ్యో నా కోడలు... కాలిపోతోంది... కాపాడండి... కాపాడండి'' అంటూ వంగి వంగిగా అరుస్తోంది. అప్పటికే ఆమె పూర్తిగా కాలిపోయి వుండడం గమనార్హం. చుట్టుప్రక్కల వాళ్లంతా ఒక్కొక్కరుగా అక్కడ గుమికూడారు. శారద చావుకి బాధపడ్తోన్న భాస్కరానికి వివిధరకాలుగా సానుభూతి పరంపరలు కురిపిస్తున్నారు. నా భార్య మాత్రం శారద ఆత్మహత్య చేసుకుందేమోనని నిర్ధారించుకుంది. అయినా బయటపడ లేదామె.

ఆ రాత్రి ఆ షాక్‌తో మొదలైన జ్వరం మా బాబుకి వారంరోజులవరకూ తగ్గనేలేదు ... మగతగా ఏదో నిద్రా, మెలకువా కాని పరిస్థితిలో ఏదేదో పలవరిస్తూ అలా పడివున్నాడు.

నిన్న పథ్యం పెట్టాక

''ఎందుకురా నాన్నా ఏమిటలా పలవరిస్తున్నావు? ఏమైంది నీకు? భయపడ్డావా? ఛి... ఛీ కరాటే వీరుడివి నీకు భయమెందుకూ? ఓహో నేను దీపావళి రోజున త్వరగా రాలేదని కోపమొచ్చిందా? అంటూ ఎంతగా

నో బుజ్జగించి బుజ్జగించి ప్రశ్నించిన తర్వాత గానీ వాడు అసలు విషయం బయటపెట్టలేదు...

"వద్దు డాడీ... మనం దీపావళి రోజు టపాకాయలు కాల్చుకోవద్దు" అంటూ భయంగా నన్ను చుట్టేశాడు. చెప్పదల్చుకున్నదంతా చెప్పి భారంగా నిట్టూర్చాడు సుందరం...

"ఐ.సీ... మరి సుందరంగారూ! విషయం విన్న వెంటనే మీరు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి రిపోర్టు చేయక నావద్దకి వచ్చేరేంటి?" ప్రశ్నించింది సంధ్య... నిజంగానే సంధ్యకి అర్థంకాలేదు... సుందరం తన దగ్గరికొచ్చి ఇదంతా ఎందుకు చెప్తున్నాడో.

నవ్వాడు సుందరం.

ఓ జ్ఞాన వృద్ధుడు పసిపాపని చూసి జాలిపడి నవ్వినట్లుగా వుందా నవ్వు.

సంధ్యారాణి చిన్నబుచ్చుకుంది.

"నిజమే... నేను కూడా సరిగ్గా అదే ఆలోచించి మా ఏరియా పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి కంప్లెయింటిచ్చాము..." అయితే ఎస్.ఐ. రఘురావ్ నమ్మలేదు.

"భాస్కరం నాకు బాగా తెలుసు. అతడు హత్య చేశాడంటే అందునా తన భార్యని చంపాడని మీరు చెప్తోంటే మీకు మైండ్ సరిగ్గా లేదేమోనన్పిస్తోంది" అంటూ అవమానించాడు.

ఇక నాకు అక్కడుండబుద్ధి కాక వచ్చేశాను. రాత్రంతా నాకు నిద్రపట్టలేదు.

బాగా ఆలోచించినమీదట మీ మహిళా మండలిని గురించి బాగా తెలిసిన మా ఆవిడిచ్చిన సలహాతో మీవద్దకు వచ్చాను. ఊపిరి దీర్ఘంగా పీల్చివదిలాడు సుందరం.

నిజమే అప్పుడప్పుడూ బాధిత స్త్రీకి సంబంధించినవారు న్యాయం కోసం అంటూ సంధ్యారాణి వద్దకు రావడం ఆమెకు అలవాటే.

మగాడిలో తానిదివరకెన్నడూ చూడని మరో కొత్త కోణాన్ని చూసినట్లుగా అన్పించింది సంధ్యారాణికి.



కోడళ్ళు స్టౌ పేలి మాత్రమేకాక టపాకాయలు పేలి కూడా చనిపోవచ్చుననే కొత్త మార్గాన్ని ఏర్పరచిన భాస్కరం క్షణక్షణానికీ ఆమెలో కసి పేరుకుపోతోంది.

"బాస్టర్డ్... ఇదే నిజమైతే తను వాడిని వదిలిపెట్టదు తప్పకుండా ఉరికంబం ఎక్కించే తీరుతుంది" కసిగా అనుకుంది.

ఆ సాయంత్రమే ఆమె సుందరం కొడుకు హరీష్‌ని చూసింది. ఎన్ని విధాలుగా కన్ఫ్యూజన్లో పెట్టి ప్రశ్నించినా ఆ పిల్లవాడు అదేమాట చెప్తున్నాడు. అది వేరెవరో నూరిపోసి చెప్పమన్నట్లుగా లేదు.

హరీష్ చెప్తోన్నది నిజమేనని నమ్మిన సంధ్యారాణి ఆ మర్నాడే 'గ్రేహౌండ్ డిటెక్టివ్ ఏజన్సీస్' సహాయం కోరింది...

"భాస్కరం ఎటువంటివారు... అతడి పూర్తి ప్రవర్తనా, శారద మరణం గురించిన అన్ని వివరాలూ నాకు కావాలి" అంటూ చెప్పింది.

ఒకే ఒక్కరోజులో భాస్కరాన్ని గురించిన అన్ని వివరాలూ అందజేసింది "గ్రేహౌండ్"

"భాస్కరం పెళ్లయిన నాటినుండీ శారదని డబ్బుకోసం వేధించేవాడు... ఎంత కొట్టినా తిట్టినా ఆమె పుట్టింటికి వెళ్లడానికి ఒప్పుకోకపోవడంతో ఆమెకి విడాకులివ్వడానికి ప్రయత్నించాడు... శారద సంతకం చేయనందున విడాకులివ్వడంకన్నా చంపేయడమే తేలికని నిర్ణయించుకున్నాడు... తల్లి ప్రోద్బలం కూడా ఇందుకు తోడైంది... కానీ స్టౌపేల్చి చంపడం ఈరోజుల్లో బొత్తిగా అనుమానాస్పదంగా వుంటుంది. అందుకని భాస్కరం అందుకు భిన్నంగా మరో కొత్త మార్గాన్ని ఎన్నుకున్నాడు. అదే దీపావళి పండుగ.

ఆరోజు ఆమెని టపాకాయల నెపంతో చంపాలని నిర్ణయించుకున్న తరువాత అంతకు చాలాముందునుండీ భాస్కరం అతి తెలివితో ప్రవర్తించాడు. 'విమెన్స్ వరల్డ్' ప్రెసిడెంట్ సంధ్యారాణిని స్వయంగా తన భార్యకు చీర సెలెక్టు చేయమని కోరడంతో తనకు భార్యంటే ఎంత ప్రేమో తెలియజెప్పాలనుకున్నాడు... ఆవిధంగా 'విమెన్స్ వరల్డ్' నోరు మూయించాలని అతడి వుద్దేశ్యం కావొచ్చు.

ఎస్.ఐ రఘురామ్ వద్ద భార్యకు యాక్సిడెంట్ అయిందని నటించి అతడి మెప్పు పొందడంతో భాస్కరం హత్య చేసాడంటే అతడు నమ్మలేకపోయాడు. ఇంకా అనేకవిధాలుగా నలుగురి ముందూ భార్యని ఆరాధిస్తున్నట్లుగా నటించేవాడు. చివరికి అతడి దురదృష్టంకొద్దీ ఆరేళ్ళబాబు హరీష్ చూసి వుండనట్లయితే భాస్కరం హత్య చేసి వుంటాడని ఆ భగవంతుడిక్కూడా అనుమానం కలిగి వుండేది కాదు."

ఇలా సాగింది 'గ్రేహౌండ్' ఇచ్చిన రిపోర్ట్.

అంతా చదివి సంధ్యారాణి ఆవేశంతో వూగిపోయింది.

శారద మరణం హత్యేనని 'గ్రేహౌండ్' నిర్ణయించిన తరువాత 'విమెన్స్ వరల్డ్'తో మిగిలిన అన్ని మహిళా మండలులు చేయి కలిపాయి.

స్త్రీ శక్తి కదిలింది.

హంతకుడు భాస్కరాన్ని ఉరికంబం ఎక్కించే సన్నాహాలు తీవ్రంగా మొదలయ్యాయి.